ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

Bullet Edition

మంగళవారం 8 మార్చి 2025 www.prajaasawaramdaily.com 2 pm

# బ్రహ్మకుమారిస్ చీఫ్ రతన్ మోహని ఇకలేరు

### ఈరోజు తెల్లవారుమున తుదిశ్వాస

### ప్రధాన కార్యాలయంలోని శాంతివనంకు పార్థీవ దేహం

జైపూర్ : బ్రహ్మకుమారిస్ చీఫ్ దాది రతన్ మోహిని ఈ రోజు తెల్లవారుజాము కన్ను మూశారు. ఈ నెల 25 తన 100 పుట్టిన రోజును జరుపుకొన్నారు. గత కొన్ని రోజుల నుంచి ఆరోగ్యం సరిగ్గా లేదు. ఆదివారం సాయంత్రం ఆమె పరిస్థితి మరింతగా క్షీణించడంతో.. రాజస్థాన్ లోని అబూ రోడ్డులో ఉన్న శాంతివనంలోని ట్రామా సెంటర్ కి డయాలసిస్ కోసం తరలించారు. సోమవారం పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారిపోయింది. దీంతో క్రిటికల్ కండీషన్ లో ఉన్న ఆమెను అహ్మదాబాద్ లోని జైడస్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఇవాళ తెల్లవారుజామున 1.20 నిమిషాలకు తుది శ్వాస విడిచినట్లు వెల్లడించారు. ఆమె పార్థివదేహాన్ని అబూ రోడ్డులో ఉన్న బ్రహ్మకుమారిస్ ప్రధాన కార్యాలయంలోని శాంతివనంకు తరలించారు.



సింధ్‌లోని హైదరాబాద్‌లో మార్చి 25వ తేదీ 1925న జన్మించారు. ఆమె అసలు పేరు లక్ష్మి ..ఉన్నతమైన కుటుంబంలో జన్మించారు. హైదరాబాద్, కరాచీ నుంచి ఆమె అంతర్జాతీయ స్థాయిలో బ్రహ్మకుమారిస్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. 1954లో జపాన్‌లో జరిగిన వరల్డ్ పీస్ కాన్ఫరెన్స్‌లో బ్రహ్మకుమారీల తరపున పాల్గొన్నారు.

# ఐదుగురికి ఉరే.. సరి

## దిల్ సుఖ్ నగర్ పేలుళ్ల కేసులో హైకోర్టు తీర్పు

### ఎన్ఐఏ తీర్పును సమర్థించిన న్యాయస్థానం

### 2013లో జంట పేలుళ్లు.. 18 మంది మృతి




హైదరాబాద్ : హైదరాబాద్ లోని దిల్ సుఖ్ నగర్ లో పేలుళ్లకు పాల్పడిన నిందితులకు ఉరిశిక్షే సరైందని హైకోర్టు తేల్చి చెప్పింది. ఈ మేరకు మంగళవారం తుది తీర్పు వెలువరించింది. ఎన్ఐఏ కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. పేలుళ్లకు పాల్పడి అమాయకుల ప్రాణాలు తీసిన నిందితులు అక్తర్, జియా ఉర్ రహమాన్, యాసిన్ భత్కల్, తహసీన్ అక్తర్, అజాజ్ షేక్ లకు ఉరిశిక్ష విధించింది.

### పేలుళ్లలో 18 మంది మృతి

2013 ఫిబ్రవరి 21న దిల్ సుఖ్ నగర్ బస్టాండ్ సమీపంలో కొద్ది నిమిషాల వ్యవధిలోనే రెండు పేలుళ్లు జరిగాయి. మొదట బస్టాండ్ ఎదురుగా ఒక బాంబ్ పేలగా.. అక్కడికి 150 మీటర్ల దూరంలో మరో బ్లాస్ట్ సంభవించింది. ఉగ్రవాదులు టిఫిన్ బాక్సులో బాంబు పెట్టి ఈ దాడికి పాల్పడ్డారు. దీంతో 18 మంది మరణించగా, మరో 130 మంది గాయపడ్డారు. ఈ కేసును దర్యాప్తు చేసిన నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ).. ఇండియన్ ముజాహిద్దీన్ ఉగ్రవాద సంస్థకు చెందిన యాసిన్ భత్కల్ ను ప్రధాన నిందితుడిగా తేల్చింది.

మరో ఐదుగురు ఉగ్రవాదులకు ఈ పేలుళ్లతో సంబంధం ఉందని నిర్ధారించి వారిని కోర్టు ముందు ప్రవేశపెట్టింది. సుదీర్ఘ విచారణ తర్వాత నిందితులు ఐదుగురికి ఎన్ఐఏ కోర్టు ఉరిశిక్ష విధించింది. ఈ తీర్పుపై నిందితులు హైకోర్టును ఆశ్రయించారు. తాజాగా మంగళవారం హైకోర్టు తీర్పు వెలువరించింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు రియాజ్ భత్కల్ ఇప్పటికీ పరారీలోనే ఉన్నాడు.

# రేవంత్‌జీ.. ప్రతిపాదనలు పునఃపరిశీలించండి

### కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో..

### సీఎం రేవంత్ రెడ్డికి నటి ఊర్వశీ రౌతేలా విన్నపం

ముంబయి : "సీఎం రేవంత్ రెడ్డి జీ.. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల్లో ఉన్న చెట్లు, అడవిని తొలగించే ప్రతిపాదనను పున:పరిశీలించాలి. ఇది అభయారణ్యమే కాదు... మన నగరానికి జీవం పోసే శక్తివంతమైన పర్యావరణ వ్యవస్థ" అంటూ నటి ఉర్వశీ రౌతేలా సోషల్ మీడియాలో విజ్ఞప్తి చేశారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ట్వీట్ చేశారు. ఇక ఈ వ్యవహారంలో ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డికి పలువురు నటీనటులు విజ్ఞప్తి చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన విషయం తెలిసిందే. పవన్ కల్యాణ్ మాజీ భార్య రేణు దేశాయ్, నటి దియా మీర్జా, నటుడు జాన్ అబ్రహం, పలువురు తెలుగు హీరోహీరోయిన్లు కూడా ఈ విషయమై స్పందించారు.



# పవన్ కల్యాణ్ కుమారుడికి గాయాలు

### సింగపూర్లో చిన్నారి చదువుతున్న స్కూల్‌లో అగ్నిప్రమాదం

### త్వరగా కోలుకోవాలని పలువురు ప్రముఖుల ప్రార్థనలు

అమరావతి : ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిన్న కుమారుడు పవనోవిచ్ మార్క్ శంకర్ అగ్ని ప్రమాదంలో గాయపడ్డ సంగతి తెలిసిందే. మార్క్ శంకర్ సింగపూర్ లో చదువుకుంటున్నాడు. చిన్నారి చదువుకుంటున్న స్కూల్లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో చిన్నారి చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. ప్రమాదంలో గాయపడ్డ చిన్నారులకు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.




- సింగపూర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శంకర్ త్వరగా కోలుకోవాలి.

చంద్రబాబు, ఏపీ సీఎం



- "సింగపూర్‌లోని ఒక పాఠశాలలో జరిగిన అగ్ని ప్రమాదం గురించి తెలిసి నేను షాక్ అయ్యాను. అందులో పవన్ కల్యాణ్ కుమారుడు మార్క్ శంకర్ గాయపడ్డాడని తెలిసింది. ఈ క్లిష్ట సమయంలో నా ఆలోచనలు ఆ కుటుంబంతోనే ఉంటాయి. మార్క్ శంకర్ త్వరగా, పూర్తిగా కోలుకోవాలని కోరుకుంటున్నాను"

జగన్, మాజీ సీఎం ఏపీ



- 8 ఏళ్ల వయసు ఉన్న మార్క్ శంకర్ ఆరోగ్య పరిస్థితి బాగుంది. కాళ్లకు స్వల్ప గాయాలయ్యాయి.

\- చిరంజీవి



- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గారి కుమారుడు మార్క్ శంకర్ గాయపడినట్టు తెలుసుకుని దిగ్భ్రాంతికి గురయ్యా. ఆ చిన్నారి త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా.

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

# టీడీపీ తర్వాత అతిపెద్ద పార్టీ బీఆర్ఎస్

### రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నెగిటివ్ పాలసీలు, నెగిటివ్ పాలిటిక్స్

### హెచ్సీయూలో ఏఐ అంటున్నారు..

### ఏఐ అంటే అనుముల ఇంటెలిజెన్స్

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల్లో టీడీపీ తర్వాత అతిపెద్ద పార్టీ బీఆర్ఎస్.. తెలుగు రాష్ట్రాల్లో 25 ఏళ్ళ ప్రస్థానం చేసుకుంది టీడీపీ, బీఆర్ఎస్ లేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ వేడుకల కోసం ఏర్పాట్లు శవేగంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'వరంగల్ ఎల్కతుర్తిలో 1200 ఎకరాల్లో చాలా గ్రాండ్ గా సభ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనుమతి కోసం డీజీపీ తో కూడా మాట్లాడనన్నారు. 3000 బస్సుల కోసం సజ్జనార్ ను అడిగామని తెలిపారు.

మా పార్టీ చరిత్రలో ఇది మరో పెద్ద మీటింగ్ అవుతుంది.. రాబోయే సంవత్సరం పాటు ప్రోగ్రాంలు చేస్తున్నాం.. కమిటీలు వేయడం, మెంబెర్ షిప్ లాంటివి వెంటనే మొదలు పెడతాం.. అధ్యక్ష ఎన్నిక పెండింగ్ లో ఉంది.. అందుకోసం గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర కమిటీలు వేస్తున్నాం.. జిల్లా పార్టీ కార్యాలయాల్లో 6 నెలల పాటు ప్రోగ్రాంలు చేస్తాం.. జూన్, జులై లో స్థానిక సంస్థల ఎన్నికలు పెడతారు అనుకుంటున్నాము.. మేము రెడీగా ఉన్నాం.. కేంద్రం పెట్రోలియం చార్జీలు పెంచిన దానిపై కొట్లాడతాం.. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నెగిటివ్ పాలసిలు, నెగిటివ్ పాలిటిక్స్ వల్ల చాలా నష్టం జరుగుతుంది. అని అన్నారు కేటీఆర్.

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను కేసుల్లో ఇరికించడం గురించే రేవంత్ రెడ్డి ఆలోచిస్తున్నాడు.. లగచర్ల ఘటనలో కూడా రైతుల దగ్గర నుంచే నిరసన మొదలైంది.. హెచ్‌సీయూ విషయంలో కూడా విద్యార్థులే ఉద్యమం చేశారు.. విద్యార్థులపై కేసులు ఎత్తివేస్తున్నామని బట్టి విక్రమార్క చెప్పారు.. అది మేము స్వాగతిస్తున్నాం.. హెచ్‌సీయూలో ఏఐ అంటున్నారు.. అంటే అనుముల ఇంటెలిజెన్స్ అన్నట్లేనా.. హెచ్‌సీయూలో జంతువుల మరణాలకు కారణం అయిన వాళ్లపై కేస్ లు పెట్టాల్సిందే.. 100 ఎకరాలు చదును చేయడం వల్ల.. అక్కడ దిక్కు లేక రోడ్ల మీదకు జంతువులు వస్తున్నాయని వెల్లడించారు.

16 నెలలుగా మేము ప్రధాన ప్రతిపక్షంగా మా పని మేము చేస్తున్నాం.. రెండు జాతీయ పార్టీల జుట్టు ఢిల్లీలోనే ఉంటుంది.. అందుకు ఉదాహరణ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మీనాక్షి రివ్యూలు చేయడం.. కాంగ్రెస్ కు రేవంత్ మీద నమ్మకం లేదు.. అందుకే మీనాక్షిని పంపించారేమో.. ఒక జాతీయ పార్టీకి చెందిన రాష్ట్ర నేత చెప్పులు మోస్తే... ఇప్పుడు అధికారంలో ఉన్న పార్టీ నేత డబ్బులు సంచులు మోస్తున్నాడు" అని కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు.